ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం అక్టోబరు 14, 2024



ప్రణమిల్లె పుడమి.. ప్రభవిల్లె ప్రణవి


హంస వాహనంపై కొలువైన ఉత్సవమూర్తుల వేడుక వీక్షిస్తున్న కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు



విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. విజయదశమి కావడంతో మూలానక్షత్రం స్థాయిలో భక్తులు పోటెత్తారు. 10 రోజుల్లో 9 లక్షల మంది భక్తులు వచ్చారు. శనివారం సాయంత్రం కృష్ణా నదిలో గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరుల తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో రామారావు, వేదపండితులు కలిసి మంగళవాయిద్యాలు, కోలాటం మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తెచ్చారు. ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చి, పూజలు చేసి.. విద్యుత్తు కాంతులతో అలంకరించిన హంస వాహనంపైకి తీసుకెళ్లారు. దుర్గగుడి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ జి.సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఆపై ఉత్సవ మూర్తులను వన్ టౌన్ రాణాకు తెచ్చి.. పూజలు చేశారు. సాధారణ భక్తులు భారీగా తరలివచ్చి.. తెప్పోత్సవం తిలకించారు. దుర్గాఘాట్, ప్రకాశం బ్యారేజీ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

కిక్కిరిసిన భవానీలు...

శనివారం భవానీలు భారీగా పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి వేలాదిగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో. . కొందరు ఘాట్‌రోడ్డు పక్కనున్న ఇంద్రకీలాద్రి కొండపై నుంచి అడ్డదారిలో పైకి చేరుకునేందుకు ప్రయత్నించారు.


ఎరుపెక్కిన రహదారులు

10 రోజులు 9 లక్షల మంది భక్తులు

ఈనాడు, అమరావతి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజుల్లో తొమ్మిది లక్షల మంది భక్తులు దుర్గగుడికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం అధికారులు భారీగా సౌకర్యాలను కల్పించారు. ఉత్సవాలలో 18.11 లక్షల మంచినీటి ప్యాకెట్లు, 19.58 లక్షల నీటి బాటిళ్లను భక్తులకు అందజేశారు.

- మజ్జిగ ప్యాకెట్లు: 3.12 లక్షలు
- చిన్నారులకు పాలు: 13,700 లీటర్లు
- అన్నప్రసాదం: 2 లక్షల మందికి
- రూ.500 టిక్కెట్ల అమ్మకాలు: 38,027
- రూ.300 టిక్కెట్ల అమ్మకాలు: 16,848
- రూ.100 టిక్కెట్ల అమ్మకాలు: 38,384
- విక్రయించిన లడ్డూలు: 21.01 లక్షలు
- తలనీలాలు సమర్పించిన భక్తులు: 62,329



దసరా మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉమాకాంత శర్మ నిర్వహించారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లె పండగకు వేళాయె...

నేడు కంకిపాడులో శ్రీకారం చుట్టనున్న ఉప ముఖ్యమంత్రి

కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పల్లె పండగ' వారోత్సవాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కంకిపాడులో శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేయనున్నారు. అనంతరం స్థానిక తెదేపా మండల కార్యాలయం సమీపంలో జరిగే బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 200 మంది కార్మికులు, భారీ యంత్రాలతో పనులు చేపట్టారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, పంచాయతీరాజ్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, డీఈలు, పశు సంవర్ధక, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి నాయకులు, సభాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపుపై స్థానిక పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్, పశు సంవర్ధక, డీఆర్‌డీఏ, వైద్య, ఆరోగ్య శాఖల జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి కంకిపాడులోనే ఉండి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.


విద్యుత్తు వెలుగుల్లో సభా ప్రాంగణం


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పవన్‌కల్యాణ్ పర్యటన ఇలా...

- కంకిపాడులో సీసీ రహదారులు, స్థానిక సీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేస్తారు. 'మినీ గోకులం ప్రారంభిస్తారు. వీటి శిలాఫలకాన్నీ సీహెచ్‌సీ ఆవరణలోనే అమర్చారు. మండల తెదేపా కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో సభ నిర్వహిస్తారు. ఈ వేదిక నుంచి రాష్ట్ర స్థాయిలో 'పల్లె పండగ'కు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారు.

బస్సులు.. రైళ్లు కిటకిట



విజయవాడ బస్టేషన్: దసరా సెలవులు ముగియడం.. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు, భవానీ దీక్షాధారులు, ఇతర రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు వచ్చినవారు తిరుగు ప్రయాణం కావడంతో శని, ఆదివారాల్లో పండిట్ నెహ్రూ బస్టేషన్ కిటకిటలాడింది. ప్రయాణికులతో ప్లాట్‌ఫాంలు నిండుగా కనిపించాయి. హైదరాబాద్, రాజమహేంద్రవరం ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆదివారం ఒక్కరోజే 113 అదనపు బస్సులను నడిపారు. రాజమహేంద్రవరం 80, హైదరాబాద్‌కు 33 బస్సులను నడిపామనీ.. అర్ధరాత్రి ప్రయాణికుల సంఖ్య పెరిగే వీలుండడంతో హైదరాబాద్‌కు అదనంగా మరో 34 బస్సులు సిద్ధం చేసినట్లు అధికారి నర్రా శ్రీనివాసరావు తెలిపారు.

రైల్వేస్టేషన్: విజయవాడ నుంచి సికింద్రాబాద్, బెంగళూరు, హావ్‌డా వైపు రాకపోకలు సాగించే రైళ్లన్నీ కిక్కిరిసి నడిచాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే విజయవాడ ప్లాట్‌ఫారాలన్నీ ప్రయాణికులతో నిండాయి. సాధారణ, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్ బెర్తులు నిండడంతో తత్కాల్ టికెట్లకు గిరాకీ పెరిగింది. సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ, నర్సాపూర్, మచిలీపట్నం, సింహపురి, గోదావరి హావ్‌డావైపు వెళ్లే ఫలక్‌నుమా, యశ్వంత్‌పూర్, హావ్‌డా, కోరమండల్, బెంగళూరు వెళ్లే శేషాద్రి, ప్రశాంతి, యశ్వంత్‌పూర్, చెన్నై వెళ్లే సర్కార్, మెయిల్, జీటీ, చార్మినార్, తమిళనాడు, నవజీవన్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ రద్దీగా నడిచాయి.


రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై రద్దీ



ఘుల్లుమంది గ్లాసు.. కిక్కుచూడు బాసు!

నేడు లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాలో 123 షాపులకు డ్రా

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే, గొడుగుపేట (మచిలీపట్నం)

మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ సోమవారం డ్రా తీయనుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి ఒకరికి డ్రా ద్వారా కేటాయించనుంది. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం కానుంది. కొత్త మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ షాపులను రద్దు చేసి, ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈనెల 1న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో 123 దుకాణాలకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. డ్రా ప్రక్రియ కోసం ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో, కృష్ణా జిల్లాకు మచిలీపట్నం హిందూ కళాశాలలో ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీయనున్నారు. ఇవి కాకుండా మరికొన్ని షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించనున్నారు. దీని ప్రకటన త్వరలో జారీ కానుంది.

కృష్ణా జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తుల వివరాలివీ..

స్టేషన్	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
మచిలీపట్నం	172	323	495
బంటుమిల్లి	91	92	183
అవనిగడ్డ	218	142	360
మొవ్వ	183	93	276
గుడివాడ	154	144	298
నందివాడ	61	40	101
ఉయ్యూరు	508	249	757
గన్నవరం	171	301	472
మొత్తం	1,558	1,384	2,942

టాప్ 5 ఇలా..	దుకాణం సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
1. తాడిగడప	117	57
2. తాడిగడప	116	52
3. తాడిగడప	118	51
4. మచిలీపట్నం కార్పొరేషన్	3	47
5. మచిలీపట్నం కార్పొరేషన్	4	47

ఆన్‌లైన్‌కే ఎక్కువ మంది మొగ్గు...

నగరపాలికలు, పురపాలికలు, మండలాల్లో జనాభా ఆధారంగా దుకాణాల సంఖ్య నిర్ణయించారు. ఈసారి ఆన్‌లైన్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, ఈస్ట్, వెస్ట్ స్టేషన్లతోపాటు మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు.. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మొవ్వ, గుడివాడ, నందివాడ, ఉయ్యూరు, గన్నవరం ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు తీసుకున్నారు. ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.



హిందూ కళాశాల ప్రాంగణంలో లాటరీ నిమిత్తం ఏర్పాటుచేసిన టెంట్లు

ప్రతి దరఖాస్తుకు విధిగా రూ.2 లక్షల నాన్- రిఫండబుల్ రుసుము చెల్లించాలి. ఈ ఫీజు ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం కలిపి ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా 5,825, కృష్ణా జిల్లాలో 2,942 దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా ఎన్టీఆర్‌లో రూ.116.50 కోట్లు, కృష్ణాలో రూ.58.84 కోట్ల రాబడి వచ్చింది. ఈనెల 11న సాయంత్రంతో దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసింది. ఆరోజు అర్ధరాత్రికి కానీ కచ్చితమైన వివరాలు తేలలేదు.

డ్రా ద్వారా ఎంపిక

ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చనే నిబంధనతో ఎన్టీఆర్ జిల్లాలో భారీగా స్పందన వచ్చింది. ముఖ్యంగా తెలంగాణతో సరిహద్దు ఉన్న ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. అటు తెలంగాణలో వారితోపాటు, ఇటు స్థానికులు కూడా భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతోపాటు క్వార్టర్ సీసా రూ.99కే విక్రయించనున్నట్లు ప్రకటించడంతో ఎక్కువ మంది ఎగబడ్డారు. వచ్చిన వాటిల్లో నుంచి దుకాణం వారీగా డ్రా ద్వారా ఒకరికి కేటాయించనున్నారు. షాపు కేటాయించిన రోజే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిటైల్ ఎక్సైజ్ పన్నును నాలుగు శ్లాబుల్లో నిర్ణయించారు. రెండో ఏడాది 10 శాతం మేర పన్ను పెంచారు. సోమవారం మొదటి విడత చెల్లించిన తర్వాత తాత్కాలిక లైసెన్సు జారీ చేయనున్నారు. దుకాణదారు ప్రాంగణాన్ని సిద్ధం చేసుకుని.. బ్యాంకు హామీలు సమర్పించిన తర్వాత రెండేళ్ల కాలానికి లైసెన్సు ఇవ్వనున్నారు. ఈ దుకాణాలు 16 నుంచి ప్రారంభించుకోవచ్చు.

రూ.111.68 కోట్లు.. 1,584 పనులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

జిల్లాలో నేటి నుంచి పల్లె పండగ పనులకు శ్రీకారం

పల్లెలే పట్టుగొమ్మలు అంటారు. అలాంటి పల్లెలు వైకాపా ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిపోయాయి. గత ఐదేళ్లు అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కనీస మౌలికవసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల వ్యవధిలోనే పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘ నిధులను విడుదల చేయడంతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగానే ఎన్ఈజీఎస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతి పల్లెలోనూ అభివృద్ధి పనులు చేపట్టనుంది. సోమవారం నుంచి పల్లెపండగ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

తొలుత జిల్లా వ్యాప్తంగా రూ.111.68 కోట్లతో 1584 పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఆయా గ్రామాల్లో అంతర్గత రహదారులు, శ్మశానవాటికలు, సీసీ డ్రెయిన్లు, ప్రహరీలు ఇలా అనేక పనులు చేపడుతున్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం పేరిట అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు.

నియోజకవర్గం	చేపట్టనున్న పనులు	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)
అవనిగడ్డ	385	2326.90
గన్నవరం	60	1275.00
గుడివాడ	216	1397.10
మచిలీపట్నం	324	1932.40
పామర్రు	296	1646.10
పెడన	220	1362.00
పెనమలూరు	83	1228.50
మొత్తం	1,584	11168.00



పెడన: చేవెంద్రపాలెంలో రహదారి దుస్థితి

జిల్లాలో అత్యధికంగా అవనిగడ్డ నియోజకవర్గంలో 385 పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన రూ.111.68 కోట్లతో సీసీరోడ్లు నిర్మించనున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులన్నీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చెందనున్నాయి.



సంక్రాంతి నాటికి పనులు పూర్తి: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో పల్లెపండగ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగానే వారం రోజుల పాటు నిర్వహించే శంకుస్థాపనల కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేశాం. చేపట్టే పనులన్నీ వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

-డీకే బాలాజీ, జిల్లా కలెక్టర్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.8 లక్షలు

మోపిదేవి: మోపిదేవిపురానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దసరా సెలవులు ముగింపు సందర్భంగా కుటుంబ సమేతంగా వేలాది సంఖ్యలో వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. పుట్టలో పాలు పోశారు. పొంగళ్లు నివేదించారు. చిన్నారులకు పుట్టు వెంట్రుకలు, అక్షరాభ్యాసాలు, నామకరణ, ఊయల, కుట్టుపోగుల మొక్కులు తీర్చుకున్నారు. నిత్యశాంతి కల్యాణం, మహన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకాల్లో పాల్గొన్నారు. 1252 మంది శీఘ్ర దర్శనం చేశారు. అన్నదానానికి రూ.1.25 లక్షలు, సేవా టికెట్ల ద్వారా రూ.4.5 లక్షలు, ప్రసాదాల విక్రయాలు రూ.1.33 లక్షలు, ఇతర పూజల ద్వారా మొత్తం రూ.8 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాద్ వివరించారు

రాజరాజేశ్వరీదేవిగా కొండలమ్మ

ముగిసిన దసరా ఉత్సవాలు

వేమవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం కొండలమ్మ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. చివరిరోజు శనివారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విజయ దశమి సందర్భంగా సహస్రనామ కుంకుమార్చన, సమస్త విజయప్రాప్తికి లలిత, రుద్ర హవనములు, హోమం, మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం చింతలమడ, తరకటూరు వారిచే భజన, సాయంత్రం శమీపూజ, ఊంజల్‌సేవ, పంచహారతులు, చతుర్వేద స్వస్తి, రాత్రికి చిన్నాపురం వారిచే దేవనర్తకి నాటకం, వేమవరం వారిచే భక్తి సంగీతవిభావరి ప్రదర్శించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పాలపొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. తెనాలి జడ్జి రాజశేఖర్ దంపతులు, కృష్ణా జిల్లా ఏఎస్పీ ఎస్వీడీ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలకు ముందు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిన ఉత్సవకమిటీ జాబితాకు అనుమతులు రాకుండానే ఉత్సవాలు ముగియడం గమనార్హం.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



శమీపూజ, ఊంజల్ సేవలో భక్తులు

ఆలయాల పవిత్రత పరిరక్షిస్తాం : బుద్ధప్రసాద్

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని ఆలయాల పవిత్రను ప్రభుత్వం పరిరక్షిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పులిగడ్డలో పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అర్చకులు దీవిపార్థాచార్యులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కొనకళ్లకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో మండలి వెంకట్రామ్-సాయిసుప్రియ దంపతులు పాల్గొని కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సంతర్పణను అతిథులు ప్రారంభించారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, ఈవో శ్రీనివాసరావు

శక్తి పటాల ఊరేగింపులో ఘర్షణ

మచిలీపట్నం (గొడుగుపేట),న్యూస్‌టుడే: శక్తిపటాల ఊరేగింపు సందర్భంగా పాత గొడవల నేపథ్యంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నగరంలో ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని రుస్తుంబాద నుంచి బయలుదేరిన శక్తిపటం ఆదివారం తెల్లవారుజామున కోనేరు సెంటరు చేరుకుంటున్న సమయంలో బలరామునిపేట శక్తిపటం బృందం తారసపడింది. రెండు బృందాల్లోని కొందరి మధ్య గతంలో ఉన్న గొడవల కారణంగా ఘర్షణ జరిగింది. దీనిని పర్యవేక్షిస్తున్న కవ్వింపు చర్యలకు పాల్పడంతోపాటు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుని దాడులు చేసుకునేందుకు తెగబడ్డారు. ఈ పరిస్థితుల గమనించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ఘటనలో ముగ్గురు గాయాల పాలయ్యారు. గొడవకు సంబంధించి చిలకలపూడి పోలీసులు అదే వర్గాల చెందిన వారు పెద్ద ఎత్తున ఆర్పేట స్టేషన్ వద్ద గుమిగూడారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్ ఆదేశాలతో పోలీసులు వారిని పంపించి వేశారు. ఈ ఘర్షణలో గాయపడిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్టేషన్ వద్ద గుమికూడిన జనాలు

ఆయువు విడిచి.. చిరంజీవిగా నిలిచి..

బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలు దానం

తాడేపల్లి, నిజాంపట్నం, మోపిదేవి : రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని బ్రెయిన్ డెడ్‌కు గురవడంతో వారంతా అంతులేని దుఃఖంలో మునిగిపోయారు. ఆ బాధను దిగమింగుతూ ఆ వ్యక్తి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించి మానవత్వం చాటారు. ఆ నిర్ణయం మరో నలుగురి ప్రాణాలు నిలిపింది. వివరాల్లోకెళితే.. బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన మత్స్యకారుడు చెన్ను శ్రీనివాసరావు(48) ఈ నెల 11వ తేదీన ద్విచక్ర వాహనంపై కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మోపిదేవి సమీపంలో కొక్కిలిగడ్డ వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ వైద్యశాల్లో చేర్చారు. వైద్యులు శ్రమించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో వైద్య పరీక్షల అనంతరం ఆదివారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేసేందుకు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం తెలిపారు. దీంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి నేతృత్వంలో మణిపాల్ వైద్యశాలకు కాలేయం, రెండు కిడ్నీలు, కళ్లను డాక్టర్ ఎల్వీ ప్రసాద్ వైద్యశాలకు అందించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



శ్రీనివాసరావు (పాతచిత్రం)

ఉపాధి కోసం వచ్చి ఉసురు తీశాడు

రూ.750 కోసం రైల్వే లోకోపైలెట్ హత్య ❖ నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ రత్నరాజు

విజయవాడ(రైల్వే స్టేషన్), న్యూస్‌టుడే : విజయవాడలో సంచలనం సృష్టించిన రైల్వే లోకో పైలెట్ హత్య కేసు మిస్టరీ వీడింది. రూ.750 కోసం నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రైల్వే పోలీసులు హత్య చేసిన గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా రైల్వే ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ రత్నరాజు వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన దేవకుమార్‌సాహు ఉపాధి కోసం పది రోజుల కిందట విజయవాడ వచ్చాడు. ఎక్కడా పని దొరకలేదు. తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఏదైనా నేరానికి పాల్పడాలని భావించాడు. ఇంద్రకీలాద్రి వద్ద దసరా ఉత్సవాలు జరుగుతున్న ప్రాంతంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మద్యం, గంజాయి మత్తులో హంగామా సృష్టించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో వదిలేశారు. అక్కడి నుంచి వెళ్తూ ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌పై రాయితో దాడి చేశాడు. డ్రైవర్ కేకలు వేయడంతో పారిపోయాడు. అనంతరం రైల్వే ట్రాక్ వెంట స్టేషన్ పరిసరాలకు చేరుకున్నాడు. అక్కడ గూడ్స్ బోగీలను ప్లాట్‌ఫాంపైకి షంటింగ్ చేస్తున్న లోకో పైలెట్ డి.ఎబలేజర్‌ను డబ్బులు అడిగాడు. ఇచ్చేందుకు నిరాకరించడంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. దాడి విషయాన్ని సమీపంలోనే ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న కీమెన్ గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. అనంతరం లోకోపైలెట్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. నిందితుడి కోసం రైల్వే పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు అదే రోజు నైజాం గేటు వద్ద ఒక వ్యక్తిని ఇదే తరహాలో ఇనుపరాడ్డుతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా అతను అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడి నుంచి ఫోర్‌మెన్ బంగ్లా వైపు వెళ్తుండగా దారిలో మరొకతను బాటిల్స్ ఏరుకుంటూ కనిపించాడు. అతన్ని కూడా డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో రాయితో కొట్టడానికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. అక్కడి నుంచి రైల్లో గుడివాడ, మచిలీపట్నం తిరిగాడు. ఐదు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి రైల్వే పరిసరాలను జల్లెడపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దోసపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ గేటు వద్ద నిందితుడిని ఈ నెల 12న అదుపులోకి తీసుకున్నారు. కేవలం డబ్బు కోసమే నిందితుడు హత్య చేసినట్లు డీఎస్పీ రత్నరాజు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జీఆర్పీ సీఐ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.


నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

ఏపీలో కార్ రేసింగ్ స్పోర్ట్స్ అకాడమీ

త్వరలో సీఎంతో ఎఫ్ఎమ్ఎస్‌సీఐ భేటీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా నూతన అధ్యక్షుడు అరిందమ్ ఘోష్ తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు పలువురు అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం గన్నవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన రాజధాని అమరావతికి సమీపంలో రేసింగ్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేయాలన్న సదుద్దేశ్యంతో రాష్ట్రానికి రావడం జరిగిందని చెప్పారు. ఏపీలో మోటార్ స్పోర్ట్స్ గురించి చాలా మందికి అవగాహన లేదన్న ఘోష్.. అకాడమీ ఏర్పాటు అనంతరం యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబుతో ఎఫ్ఎమ్ఎస్‌సీఐ ప్రతినిధులతో కలిసి భేటీ అవుతామని.. అకాడమీ ఏర్పాటుకు స్థలం, నిధులు, ఇతర వివరాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ కార్ స్పోర్ట్స్ హిమాలయన్ విన్నర్, గత యాభై ఏళ్లుగా కార్ రేసింగ్‌లో ప్రావీణ్యం కలిగిన అరిందమ్ ఘోష్ ఏపీలో క్లబ్ ఏర్పాటుకు ముందుకు రావడం శుభ పరిణామమని రేస్ క్రీడల ప్రమోటర్ వంశీ తెలిపారు. క్లబ్ ఏర్పాటు, మోటార్ స్పోర్ట్స్‌కు పలు కార్పొరేట్ సంస్థలు స్పాన్సర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుతో యువత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు వీలుంటుందని వివరించారు.



మాట్లాడుతున్న అరిందమ్ ఘోష్ తదితరులు

అనుమతి లేకుండా బాణసంచా నిల్వలు

వైకాపా కార్యకర్తల ఇంటిలో...

పోలీసుల దాడి: సరకు సీజ్

పెడన, న్యూస్‌టుడే: స్థానిక దక్షిణ తెలుగుపాలెంలోని ఒక ఇంటిలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.1.02 లక్షల విలువైన బాణసంచాను సీజ్ చేసినట్లు ఎస్సై జి.సత్యనారాయణ చెప్పారు. నిందితులు శిరివెళ్ల మహేష్, కోమట్ల బాలరాజులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఈబాణసంచా వైకాపా కౌన్సిలర్ చిరువెళ్ల జయేష్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. గత దీపావళికి విక్రయించగా మిగిలిన సరకును ఏడాదిగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న పోలీసులు మచిలీపట్నం డీఎస్పీ సుభానీ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. శిరివెళ్ల మహేష్ కౌన్సిలర్‌కు సోదరుడు కాగా, బాలరాజు వైకాపా కార్యకర్త కావడం గమనార్హం.



ట్రాక్టర్‌లో సీజ్ చేసిన బాణసంచా

కృష్ణా నదిలో యువకుడి గల్లంతు

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి కృష్ణా నదిలో స్నానానికి దిగిన యువకుడు గల్లంతైన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అవనిగడ్డ ప్రాంతంలోని కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజు (20), మేదరమెట్లకు చెందిన పోతినేని కేశవనారాయణ(21), నెల్లూరుకు చెందిన వెక్కల విష్ణువర్ధన్(21) విజయవాడ లబ్బీపేట పైడయ్య వీధిలోని బాయ్స్ హాస్టల్ ఉంటూ సీఏ చదువుతున్నారు. కృష్ణా నదిలో స్నానం చేద్దామన్న నిర్ణయానికి వచ్చిన ముగ్గురూ ఆదివారం సాయంత్రం కృష్ణలంక స్వర్గపురి సమీపంలో నదిలోకి వెళ్లారు. రాజా, విష్ణువర్ధన్ నీటిలో దిగారు. కేశవనారాయణ మాత్రం ఒడ్డునే ఉండి ఫోన్ మాట్లాడుతున్నాడు. కొద్దిసేపటికి విష్ణువర్ధన్ నీటిలో మునుగుతూ కేకలు వేయగా.. సమీపంలోని జాలరులు అప్రమత్తమై అతడిని బయటకు తీశారు. రాజు కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో కృష్ణలంక పోలీసులు నదిలో గాలించారు. చీకటి పడటంతో రాజు ఆచూకీ లభించలేదు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు కృష్ణలంక పోలీసులు తెలిపారు.



రేపల్లె రాజు (పాత చిత్రం)

డీఎస్సీ ఉచిత శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలి

అవనిగడ్డ, నూస్‌టుడే: డీఎస్సీ శిక్షణ బీసీ అభ్యర్థులకు మెరుగైన శిక్షణ కోసం ఉచిత శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలని బీసీ నేత, రాష్ట్ర సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కోరారు. అవనిగడ్డ మత్స్యకారుల సామాజిక భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు శిక్షణా సంస్థల్లో రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని, పేద వర్గాలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఉర్దూ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెడన, న్యూస్‌టుడే: పెడన నియోజకవర్గంలోని ఉర్దూ పాఠశాలలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నాయని పలువురు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రెహ్మాన్‌బేగ్ ఆధ్వర్యంలో బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేటలోని నివాసంలో కలిసిన ఉపాధ్యాయులు ఉర్దూ పాఠశాలల ప్రగతికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెడన 4వ వార్డు పాఠశాలను ప్రాథమికోన్నత స్థాయికి వర్గోన్నతి చేసినా అక్కడ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయలేదని, ఫలితంగా 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు ఉర్దూ భాషకు దూరమవుతున్నారని చెప్పారు. కృత్తివెన్ను మండలం చినపాండ్రాక, బంటుమిల్లి ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ పోస్టులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌బాషా, మీర్జా ఆలీ రజా, మహ్మద్ ఈశా తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పల్లెపండగ

పెడన, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లెపండగ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజున కృత్తివెన్ను మండలం మాట్లం, నిడమర్రు గ్రామాల్లో నిర్వహిస్తోన్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఈసందర్భంగా పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు జరుగుతాయి. 20న బంటుమిల్లి మండలం అర్తమూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కూటమి నేతలు పల్లెపండగలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించండి



మాట్లాడుతున్న పాండురంగవరప్రసాద్

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీటీఎఫ్(257) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగవరప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని సంఘ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ వచ్చేలోపు ఐఆర్ ప్రకటించడంతోపాటు వివిధ బకాయిలు విడుదల చేయాలన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షులు అంబటిపూడి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.కల్యాణి, పీసీసీ ప్రసాద్, పి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు పి.శివాజీగణేష్, సీహెచ్ నాగప్రసాద్, వై.శ్రీనివాసరావు, ఎ.సురేష్, ఎన్.శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఉద్యోగిగా బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తూనే.. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషిచేసిన ఉద్యమకారుడు చంద్రపాల్ అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మచిలీపట్నం ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో హయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన టి.చంద్రపాల్ అభినందన సభ ఆదివారం నగరంలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించారు. సభలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఎల్ఐసీ యూనియన్ సౌత్‌సెంట్రల్ జోనల్ ఫెడరేషన్ నాయకులు జి.తిరుపతయ్య, ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని చంద్రపాల్ దంపతులను సత్కరించారు.

ఉత్సాహంగా షటిల్ పోటీలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడులోని మేడేపూడి సుబ్బారావు ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు కేటగిరిల వారీగా పోటీ పడ్డారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు వీరమాచనేని సత్యప్రసాద్ శనివారం ఈ పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు వీరమాచనేని నాగయ్య, మత్తి సాంబశివరావు, జొరిగే శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండెక్కిన కూరగాయలు!

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

ఇటీవల వచ్చిన వరదలు, కురిసిన వర్షాలతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కాయగూరల తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలకు సరిపడా అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి రైతు బజారుకు తీసుకొస్తున్నారు. దీంతో కూరగాయల ధరలు కొండెక్కడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ధరలను నియంత్రించడంతో పాటు టమాటాలు, నూనెలను తగ్గింపు ధరల్లో రైతుబజారులో విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. అయితే బయట మార్కెట్లో మాత్రం ధరలు మండిపోతున్నాయి.

కూర గాయలు (కిలో)	ఆగస్టు (రైతు బజారు)	అక్టోబరు (రైతు బజారు)	బహిరంగ మార్కెట్‌లో
టమాటా	31	71	100
వంకాయ	34	36	45
బెండ	16	32	43
పచ్చిమిర్చి	35	50	60
బీర	34	44	55
దొండ	30	46	55
బంగాళదుంప	39	40	50
దోస	16	30	40
కాకర	40	40	50
చామదుంప	35	36	45
బీన్స్	68	98	110
ఉల్లి	38	52	65

నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

రైతుబజారులో అందుబాటు ధరల్లో..



మునిగిన తోటలు.. తగ్గిన ఉత్పత్తులు

బందరు మండలంతో పాటు తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, పామర్రు, మోపిదేవి, పెనమలూరు, గన్నవరం, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో కూరగాయల తోటలు సాగు చేస్తుంటారు. సాగు ప్రారంభంలో కురిసిన వర్షాల కారణంగా పంటలు దెబ్బతినగా తరువాత వచ్చిన వరద తోటలన్నింటినీ ముంచెత్తింది. దీంతో కూరగాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో కూరగాయల సాగు జరుగుతుంది. ఈ తోటల నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతుబజార్లకు కూరగాయలు సరఫరా అవుతాయి. ప్రస్తుతం డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయలు సరఫరా కాకపోవడంతో ఇతర జిల్లాల నుంచి కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల ఆందోళన.. ధరల నియంత్రణ

ఈ ఏడాది ఆగస్టు నెలలో రైతుబజారులో ఉన్న ధరలను ప్రస్తుత ధరలతో పోల్చితే కొన్ని కూరగాయలు రెట్టింపు అయ్యాయి. సామాన్యులు రూ.100 తీసుకుని రైతుబజారుకు వస్తే రెండు రకాల కూరగాయలు కూడా రాని పరిస్థితి నెలకొంది. మచిలీపట్నం రైతుబజారులో ఆగస్టులో టమాటా కేజీ రూ.31 ఉంటే ప్రస్తుతం రూ.71కి చేరుకుంది. వంకాయ, బెండకాయ, బంగాళదుంప ఇలా అన్నింటి ధరలు అలాగే ఉన్నాయి.

అందుబాటులో ఉండేలా చర్యలు

– అమీర్‌బాషా, ఎస్టేట్ అధికారి, మచిలీపట్నం రైతుబజారు

బయట మార్కెట్లో కూరగాయల ధరలు ఎక్కువగా ఉండడంతో రైతుబజారుకు వచ్చే వినియోగదారుల సంఖ్య పెరిగింది. గతకొన్ని రోజులుగా రోజుకు 5వేల మంది చొప్పున వస్తున్నారు. వారికి అవసరమైన కూరగాయలను అందుబాటులో ఉంచేలా కృషి చేస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో తోటలు దెబ్బతినడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోజుకు 230 టన్నుల వరకు అందుబాటులో ఉంచుతున్నాం.

ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

– వి.పార్వతి, డీఎస్‌వో

రైతుబజారులో ప్రత్యేక కౌంటర్ల ద్వారా టమాటాలు, పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె తక్కువ ధరకు విక్రయిస్తున్నాం. గురువారం నూనెల విక్రయాలు కూడా ప్రారంభించాం. టమాటా కేజీ రూ.50, కేజీ పామాయిల్ రూ.114, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు విక్రయిస్తున్నాం. మచిలీపట్నం రైతుబజారును సందర్శించి విక్రయాలను పరిశీలించాం. ప్రజలందరూ వినియోగించుకోవాలి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పోతేపల్లి(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పోతేపల్లి జ్యుయలరీ పార్కులో విజయకనకదుర్గ మల్లేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఉదయం వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్ఛారణ నడుమ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామి వారి ఎదురుగా నందీశ్వరుడు కొలువు దీరాడు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలను పండితులు ప్రతిష్ఠించారు. వేలాదిమంది భక్తులు స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అత్తపై అల్లుడి దాడి

పెడన, న్యూస్‌టుడే: అత్తపై అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన స్థానిక బంటుమిల్లి రోడ్డు జంక్షన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బందరు మండలం భైరాగిపాలేనికి చెందిన బొల్లా నాగలక్ష్మి(43) ఈనెల 11న పెడన మండలం కొంకేపూడిలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో అల్లుడు తాతా నాంచారయ్య ప్రవర్తన సరిగాలేదని మందలించారు. తన కుమార్తె ఉండగానే మరొకరి పెళ్లిచేసుకోవడాన్ని ఆమె ప్రశ్నించారు. ఆతర్వాత ఆమె పెడన మీదుగా తమ కుమారుడు నాగ శ్రీనుతో కలిసి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరగా వెంబడించిన అల్లుడు నాంచారయ్య పెడనలోని బంటుమిల్లి రోడ్డులో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ప్రతిఘటించిన బావమరిదిపై కూడా దాడి చేశాడు. ఈదాడిలో గాయపడిన తల్లీకుమారులను మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈదాడిలో నాంచారయ్యతో పాటు శివ, ప్రసన్న వెంకటేశ్వరరావులు కూడా ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదుచేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై గన్నవరం పోలీసులు ఆదివారం దాడి చేశారు. స్టేషన్ పరిధిలోని మాదలవారిగూడెంలో నిర్వహించిన దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, సుమారు రూ.మూడు వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు.

42 క్వింటాళ్ల చౌక బియ్యం పట్టివేత

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: యాకమూరు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన వలస గంగరాజు తోట్లవల్లూరు పరిసర ప్రాంతాల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి టాటా వ్యాన్‌లో ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్‌కు చెందిన 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని యాకమూరు నుంచి నూజివీడుకు చెందిన సోల రాముకు తరలిస్తుండగా పోలీసులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార, పీడీఎస్, రెవెన్యూ వారి సమక్షంలో దాడులు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆదివారం తెలిపారు.

విజయ డెయిరీ పునఃప్రారంభం



మాట్లాడుతున్న కృష్ణా పాల సమితి ఛైర్మన్ ఆంజనేయులు, పక్కనే ఎండీ ఈశ్వరబాబు

చిట్టినగర్, న్యూస్‌టుడే : బుడమేరు ముంపుతో దాదాపు 40 రోజుల పాటు మూతపడిన విజయ డెయిరీని దసరా పండగ రోజున పునఃప్రారంభించామని కృష్ణా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయ డెయిరీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురై ఫ్యాక్టరీ పనిచేయక పోయినప్పటికీ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరవల్లిలోని కామధేనువు పేరుతో నిర్మించిన కొత్త ఫ్యాక్టరీ ఆదుకుందన్నారు. అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించామన్నారు. డెయిరీకి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీడీబీ వారికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా సిఫార్సు చేశారని తెలిపారు. విజయ డెయిరీ మేనేజింగ్ డైరక్టర్ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఆంజనేయులు చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. రైతులకు బోనస్ రూ.250 కోట్లకు పైగా చెల్లించారని వివరించారు. పాలసేకరణ పెరిగిందన్నారు. సమావేశంలో పలువురు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు



మచిలీపట్నం: రాజరాజేశ్వరీ దేవిగా పార్వతీదేవి



రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



యతిరాజభవనంలో..



పోతేపల్లిలో..



గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో..



పెడన: కన్యకా పరమేశ్వరీ ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారం



బంటుమిల్లి : పాశ్చాపురంలో..



బంటుమిల్లి : పెదతుమ్మిడి శివాలయంలో..

న్యూస్‌టుడే బృందం: వివిధ దేవాలయాల్లో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు పలు చోట్ల శమీ పూజలు చేశారు. బందరుకోట కోదండరామాలయంలో అమ్మవారికి మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు ప్రత్యేకపూజలతోపాటు వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు జరిపించారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆయుధ పూజలు చేశారు.



వాహనాలకు పూజ చేస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు



బందరుకోట కోదండరామాలయంలో హోమం చేస్తున్న మంత్రి రవీంద్ర దంపతులు, భక్తులు



ఎస్.ఎన్.గొల్లపాలెంలో కుంకుమార్చన



పెడన :చేవెంద్రలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాగిత, తెదేపా నాయకులు



పెడన: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



బంటుమిల్లి: షిర్డీ సాయిబాబా విగ్రహానికి అభిషేకం



కప్పలదొడ్డిలో అమ్మవారి ఊరేగింపు

స్వచ్ఛ చల్లపల్లికి రూ. 2లక్షల విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన పనులకు 'మన కోసం మనం' ట్రస్ట్‌కి రూ.2లక్షల విరాళాన్ని జాస్తి ప్రసాద్-లక్ష్మీ రాణి కుమారుడు హేమంత్-నిశ్చల దంపతులు ట్రస్ట్ సభ్యుడు ఎన్.రామారావుకు ఆదివారం అందించారు.

సాగరం వద్ద జాగ్రత్తలు పాటించండి

కోడూరు: సాగరంలో స్నానాలు చేసే యాత్రికులు జాగ్రత్తలు పాటించాలని సీఐలు యువకుమార్, సురేష్‌రెడ్డి తెలిపారు. పాలకాయతిప్ప సముద్రం వద్ద ఆదివారం స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులకు వారు సూచనలు చేశారు.

సినిమాలు

రేవతీ- **వేట్టయన్** మినీరేవతి- **మార్టిన్**
సిరివెంకట్: **దేవర** సిరికృష్ణ: **విశ్వం**
రామరాజు: **జనక అయితే గనక**

- మచిలీపట్నం కార్పొరేషన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని మచిలీపట్నం సర్వజనాసుపత్రి ఎదుట ప్రధాన రహదారి పక్కన డ్రెయిన్‌లో వ్యర్థాలు మేట వేసుకుపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. **-స్థానికులు**

✔ సిబ్బందిని పంపి వెంటనే పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మచిలీపట్నం నగరపాలకసంస్థ**

? శ్రీనివాసనగర్ కాలనీలో అంతర్గ రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రహదారుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

-స్థానికులు

✔ వివిధ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **-బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్**

–న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

లెక్క తేల్చారు.. చర్యలు ఆపారు

పెడనలో 43 అనధికార లేఔట్లు

వైకాపా హయాంలో నిబంధనలకు తిలోదకాలు

పెడన, న్యూస్‌టుడే

పెడన పట్టణంలో 43 అనధికార లేఔట్లు ఉన్నట్లు మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు లెక్క తేల్చారు. ఈలేఔట్ల ద్వారా మున్సిపాలిటీ రూ.5 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని అధికారులు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దాదాపు 69.90 ఎకరాల విస్తీర్ణంలో అనధికార లేఔట్లు ఏర్పాటవుతున్నా..టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

మచిలీపట్నం పోర్టు రాకతో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందన్న అంచనాలతో పెడనలోని బంటుమిల్లి రోడ్డు, గుడివాడ, పెడన బైపాస్‌ల వైపు పట్టణం విస్తరిస్తోంది. 216 జాతీయ రహదారి రాకతో ఇప్పటికే బంటుమిల్లి రోడ్డులోని తోటమూల జంక్షన్ వ్యాపార కేంద్రంగా మారింది. ఈనేపథ్యంలో ఈరెండు రహదార్లకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములను కొంత మంది రియల్టర్లు లేఔట్లుగా మార్చి ప్లాట్ల కింద విక్రయిస్తున్నారు. భూమిని లేఔట్‌గా మార్చేందుకు పాటించాల్సిన నియమ నిబంధనలకు పూర్తిగా తిలోదకాలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెడనలో 43 లేఔట్లలో నిబంధనల ఉల్లంఘించి..ప్లాట్లు విక్రయించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. వైకాపా పాలనలో పట్టణ ప్రణాళిక అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారన్న ఆరోపణలు లేకపోలేదు.



లేఔట్‌ను ధ్వంసం చేస్తున్న మున్సిపల్ కార్మికులు (పాతచిత్రం)

అధికారులు సస్పెండైనా: 2014-18 మధ్య ఏర్పాటైన అనధికార లేఔట్లపై అప్పటి తెదేపా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. దీనిపై విజిలెన్స్ విచారణ చేయించి ఏకంగా 8 మంది అధికారులను సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ట్రేసర్లు ఉన్నారు. అప్పట్లో ఈసంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆతర్వాత వైకాపా అధికారంలోకి వచ్చింది. అధికారులను బెదిరించి.. ఏకంగా 43 లేఔట్లను అనధికారికంగా ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఒక్క రూపాయి కూడా మున్సిపల్ ఖజానాకు చెల్లించలేదు.

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం

గుర్తించిన 43 లేఔట్ల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. కౌన్సిల్ కూడా అనుమతులు జారీచేసింది. ఇక్కడ స్థలాలు కొనుగోలు చేస్తే మున్సిపాల్టీ పరంగా ఎలాంటి సౌకర్యాలు సమకూర్చమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు పెట్టుబడి పెట్టి మోసపోవద్దు. త్వరలో లేఔట్ల యజమానులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం.

- బళ్ల సృజనకుమారి, టీపీవో

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

నేటి నుంచి పల్లె పండగ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పల్లె పండగ సందర్భంగా నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలో మీటర్ల పొడవున 496 సిమెంట్ రహదారులు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ..పంచాయతీ వారోత్సవాలు పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

★ అవనిగడ్డ మండలంలో రూ.625.80 లక్షలతో 10331 మీటర్ల పొడవున 117 సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి, 20న ఉదయం 10 గంటల నుంచి ఈ పనులకు శంకుస్థాపన చేస్తారు.

★ **మోపిదేవి :** రూ.563.20 లక్షలతో 8899 మీటర్ల పొడవున 86 రహదారుల నిర్మాణానికి 17న ఉదయం 10 గంటల నుంచి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

★ **చల్లపల్లి :** రూ.550.20 లక్షలతో 8943 మీటర్ల పొడవున 90 రహదారుల నిర్మాణానికి ఈ నెల 16న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేస్తారు.

★ **కోడూరు :** రూ.447.10 లక్షలతో 6861 మీటర్ల పొడవున 68 రహదారులకు 18న ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారు.

★ **ఘంటసాల :** రూ.370.25 లక్షలతో 5335 మీటర్ల పొడవున 54 రహదారులకు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

★ **నాగాయలంక** మండలంలో రూ.511.40 లక్షలతో 8361 మీటర్ల పొడవున 81 సిమెంటు రహదారుల నిర్మాణానికి ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

పామర్రు నియోజకవర్గంలో..

పమిడిముక్కల, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన పల్లె పండగ కార్యక్రమాన్ని పామర్రు నియోజకవర్గంలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహిస్తామని శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా తెలిపారు. 14న మొవ్వ: కాజ, మొవ్వ, 15న పమిడిముక్కల: మేడూరు, హనుమంతపురం, ఐనంపూడి, 16న తోట్లవల్లూరు: తోట్లవల్లూరు, గరికపర్రు, పెనమకూరు, 17న పెదపారుపూడి: వానపాముల, వెంట్రప్రగడ, వింజరంపాడు, 18న పామర్రు: పెదమద్దాలి, బల్లిపర్రు, 19న పమిడిముక్కల: మర్రివాడ, తాడంకి, కపిలేశ్వరపురం, 20న పెదపారుపూడి: యలమర్రు, పెదపారుపూడి, చినపారుపూడిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో కొత్తగా నిర్మించనున్న సిమెంటు కాంక్రీటు రోడ్లకు శంకుస్థాపన చేస్తారని ఈఓపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

పురపాలక కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా బి.శ్రీనివాస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం డీఎంఏ కార్యాలయంలో సహాయ డైరెక్టర్‌గా పని చేస్తున్న బి.శ్రీనివాస్ గుడివాడ కమిషనర్‌గా నియమితులయ్యారు.


ఎమ్మెల్యే రాముకు మొక్క అందజేస్తున్న శ్రీనివాస్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ అభివృద్ధిలో పురపాలక కమిషనర్‌గా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ బి.శ్రీనివాస్ స్థానిక తెదేపా కార్యాయంలో ఆదివారం ఎమ్మెల్యే రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తాగు నీరు, పారిశుద్ధ్య సమస్యలకు తక్షణం సిబ్బంది స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు రూ. 2 లక్షల విరాళం

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన పనులకు ‘మన కోసం మనం’ ట్రస్ట్‌కి రూ.2లక్షల విరాళాన్ని చల్లపల్లి ప్రముఖులు జాస్తి ప్రసాద్-లక్ష్మీ రాణి కుమారుడు హేమంత్-నిశ్చల దంపతులు ట్రస్ట్ సభ్యుడు ఎన్.రామారావుకు ఆదివారం అందించారు. డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ట్రస్ట్ సభ్యుడు రామారావుకు విరాళం అందిస్తున్న ప్రసాద్ కుటుంబసభ్యులు

సాగరం వద్ద జాగ్రత్తలు పాటించండి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: సాగరంలో స్నానాలు చేసే యాత్రికులు లోతులోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఐ యువకుమార్, మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పాలకాయతిప్ప సముద్రం వద్ద ఆదివారం స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులకు వారు సూచనలు చేశారు.

టపాసుల దుకాణాలకు 19లోగా దరఖాస్తు చేసుకోండి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటు కోసం ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని గుడివాడ టపాసుల చిల్లర వర్తక సంఘం అధ్యక్షుడు దాసరి మహేష్ తెలిపారు. శ్రీనివాస సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్సు కోసం 19లోగా సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 98497 73799, 93909 62308 నంబర్లలో సంప్రదించాలన్నారు. సంఘ కార్యదర్శి దిలేష్ ఖన్నా, కోశాధికారి పాలంచు భాస్కరరావు, గౌరవ సలహాదారులు తుమ్మలపల్లి బాబు, ఎల్.శ్యామ్, సభ్యులు పాల్గొన్నారు.

మస్టర్ల మాయాజాలం

■ గుడివాడ పురపాలికలో బినామీ కార్మికుల దందా

■ గత వైకాపా పాలన నుంచి కొనసాగుతున్న అక్రమాలు

న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం

గుడివాడ పురపాలక సంఘంలో పని చేయకుండా జీతాలు తీసుకునే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని ప్రజారోగ్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పర్మినెంట్ కార్మికులు 80 మంది, పొరుగు సేవల కింద 199 మంది వెరసి మొత్తం 279 మంది పని చేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డులకు వారిని కచ్చితంగా కేటాయిస్తే రోజూ కనీసం ఏడుగురు చొప్పున పనిలో ఉండాలి. వివిధ కారణాలతో వారిలో చాలా మంది విధుల్లో కానరావడం లేదు. అయినా వారికి మస్టర్లు వేస్తూ జీతాలు చెల్లిస్తున్నారు. కొందరికి రాజకీయ పలుకుబడి ఉండడం, మరికొందరికి వారి తండ్రులు మేస్త్రీలు కావడం వలన పనిలో ఉండడం లేదు. జీతాలు మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో యథావిధిగా జమ అవుతున్నాయి. పొరుగు సేవల కింద పని చేస్తున్న కొందరైతే పారిశుద్ధ్య పరికరాలు(చీపురు, పార తదితరాలు) చేతపట్టిన దాఖలాలు లేవు. అలాంటివారంతా నెలకు రూ. 5 వేల నుంచి రూ.6 వేల వరకు అధికారులు, మస్టరు వేసే ఉద్యోగుల చేయి తడుపుతూ రూ. 23 వేల వరకు జీతాలు పొందుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల అండతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పని చేసిన వారు భారీ స్థాయిలో అక్రమార్జనకు తెగబడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొందరు స్వార్థపరుల అండతో పని చేయకుండా 25 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు జీతాలు తీసుకుంటున్నారు.



పరికరాలు లేవు..
పని భారమూ ఎక్కువే..

పట్టణంలో చెత్త సేకరణ, తరలింపు కోసం మౌలిక సదుపాయాలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. పరికరాలు, తోపుడు బళ్లు లేవని, చెత్త తొలగించే రెండు ఐషర్ వ్యాన్లు మూలకు చేరాయని కార్మికులు వాపోతున్నారు. గతంలో పని చేసే చెత్త లారీలు ఆపేశారు. డంపర్ బిన్‌లు కూడా మాయమవుతున్నాయని చెబుతున్నారు. పర్యవేక్షకుల జాడ కానరావడం లేదు. అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఇళ్లలో పనులకు కొందరు కార్మికులు పరిమితమవుతున్నారు. మిగిలిన వారంతా వార్డుకు అయిదుగురు చొప్పున పని చేస్తున్నారు. వారిలో చెత్త బండి తోలే డ్రైవర్లు పోగా ఉన్న ముగ్గురిపై అధిక పని భారం పడుతోంది. దీంతోపాటు వారంలో రెండు, మూడు రోజులు 40 మంది చొప్పున కార్మికులు టిడ్కో కాలనీలో పని చేయాల్సి వస్తోంది. ఆ సమయాల్లో ప్రతి వార్డులో ఒకరిద్దరు మాత్రమే వీధులు, కాల్వలు శుభ్రం చేయడం, చెత్త తొలగించాల్సి వస్తోంది. బినామీ కార్మికులపై చర్యలు తీసుకోవాలని, పనికి రాని వారికి మస్టర్లు వేసే వారిపై, శానిటరీ ఎన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికుల సంఘ నాయకులు ఇటీవల ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు.

పేర్లు చెబితే చర్యలు తీసుకుంటాం

పలువురు పారిశుద్ధ్య కార్మికులు పని చేయకుండా మస్టర్లు వేయించుకొని జీతాలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారి పేర్లు చెబితే వెంటనే చర్యలు తీసుకుంటాం. తాను కూడా తనిఖీలు చేసి అక్రమార్కుల భరతం పడతాం.

– పి.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్

వరద బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ

నందివాడ(గుడ్లవల్లేరు): నందివాడ మండలంలోని చేదుర్తిపాడులో శనివారం వరద బాధితులు 170 కుటుంబాలకు ప్రముఖ బిల్డర్ తుమ్మల గోపీచంద్ నిత్యావసర సరకులు అందజేశారు. సర్పంచి బొల్లా వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి మధుమేహ పరీక్షలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ వైద్యురాలు జి.రజిని, వైద్య సిబ్బంది పాల్గొని 100 మంది రోగులకు తొలుత వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి పరీక్షలు చేసి దాతల వితరణతో ఉచితంగా మందులు అందించినట్లు లయన్స్ ప్రతినిధి మూల్పూరి సుధాకర్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

నాగాయలంక: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. బర్రంకులలో నూతనంగా నిర్మించిన జనసేన జెండా దిమ్మను ఆయన ఆదివారం ప్రారంభించారు. తెదేపా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టి.స్వర్ణలత, అవనిగడ్డ జనసేన అధ్యక్షుడు జి.శేషుబాబు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడులు

చాగంటిపాడు(తోట్లవల్లూరు): చాగంటిపాడులో కృష్ణా నది పక్కన కొనసాగుతున్న కోడిపందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. నాలుగురు జూదరుల్ని పట్టుకొని వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.3,600 నగదు స్వాధీనం చేస్తుకున్నామని ఎస్సై తెలిపారు.

శివాలయం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

పెదకళ్లేపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో కృష్ణానదీ తీరాన కొలువైన అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మసూత్ర శివాలయంలో పలు అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. దాతల ఆర్థిక సహకారాలతో తొలుత ప్రహరీ నిర్మిస్తున్నారు. ఎ.వెంకట సుబ్బారావు, ఎ.కిరణ్‌కాంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎర్రజెండా దేశానికి దిక్సూచి

మోపిదేవి, న్యూస్‌టుడే: రానున్న కాలంలో ఎర్రజెండా రెపరెపలే దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. మోపిదేవి సీపీఐ సీనియర్ నాయకుడు, పంచాయతీ మాజీ సర్పంచి కంఠంనేని అచ్చుతరామయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామారావు, రాఘవేంద్రరావు, మేరీరాణి, పిచ్చియ్య, ప్రసాద్, రత్నకుమారి, నాగేశ్వరరావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుంది

ఆముదార్లంక(చల్లపల్లి), న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా అభివృద్ధి చెందుతుందనే విశ్వాసం ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆముదార్లంకలో నూరుశాతం సీసీరోడ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.85.70 లక్షలతో 1500మీ పొడవైన 17 సీసీ రోడ్లను గ్రామంలో నిర్మించనున్నారు. తొలుత దాతలు మండవ రమాదేవి, మండవ ఝాన్సీలక్ష్మి, వేములపల్లి రాఘవేంద్రరావు పునర్నిర్మించిన వాటర్‌ప్లాంటును బుద్ధప్రసాద్ ప్రారంభించారు. సర్పంచి ఆదిలక్ష్మి, చల్లపల్లి సర్పంచి పి.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ రాంబాబు, వి.రాఘవేంద్రరావు, తెదేపా నాయకులు బాలవర్ధిరావు, దిలీప్‌కుమార్, పీఆర్ ఏఈ బి.శ్రీనివాసరావు, ఈవో నాగలక్ష్మి పాల్గొన్నారు.


వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అపూర్వ కలయిక



గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ ఏజీకే పురపాలక ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని ఆడుతూ.. పాడుతూ ఆనందంగా గడిపారు. అనంతరం తమ గురువులను ఘనంగా సత్కరించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక చల్లపల్లి రోడ్డులో ఆదివారం అయ్యప్పస్వాములు స్వామికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించి అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పామర్రు : అలంకారంలో అంకమ్మతల్లి


పామర్రు : కన్యకాపరమేశ్వరి


పామర్రు : పార్వతీదేవి


పామర్రు గ్రామీణం : కొండిపర్రు భ్రమరాంబ


కూచిపూడి : సంతోషిమాతగా బాలాత్రిపురసుందురిదేవి


కూచిపూడి : అయ్యంకిలో..


మొవ్వలో శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారు


మొవ్వ : మహాలక్ష్మిదివిగా రాజ్యలక్ష్మి


మోపిదేవి ఆలయంలో శమీ పూజ


మోపిదేవి : పెదకళ్లేపల్లిలో సామూహిక కుంకుమార్చన



నాగాయలంక : నిమజ్జనానికి తరలి వెళ్తున్న దుర్గాదేవి


నాగాయలంక : కృష్ణా నదిలో అమ్మవారి తెప్పోత్సవం


తోట్లవల్లూరు శివాలయంలో రాజారాజేశ్వరిదేవిగా


భద్రిరాజుపాలెంలో..


పెదపారుపూడి: వెంట్రప్రగడలో మహిషాసురమర్దినిగా


పెదపారుపూడి: లక్ష్మీనర సింహస్వామి దేవస్థానంలో


పమిడిముక్కలలో..


అవనిగడ్డ: శివాలయంలో ..


మండపాకలలో అద్దంకి నాంచారమ్మ


పులిగడ్డలో..


వేకనూరులో..


మోపిదేవి : పెదకళ్లేపల్లి దుర్గమ్మ


ఘంటసాల : భ్రమరాంబ అమ్మవారు


ఘంటసాల : శీలంవారిపాలెంలో రాజరాజేశ్వరీదేవిగా.


పాలకాయతిప్పలో సారె సమర్పిస్తున్న మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, సిబ్బంది

జయ శుభకారిణి.. విజయ రూపిణి

పది రోజులపాటు భక్తిశ్రద్ధలతో కొనసాగిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శమీ పూజ, జమ్మి కొట్టడంతో వైభవంగా ముగిశాయి. శమీ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని ఆలయాలు, పందిళ్లలో ఉత్సవాల ముగింపు రోజున అమ్మవారిని వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చనలు చేశారు. దాతల సహాయంతో పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. ఉత్సవ పందిళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను శనివారం రాత్రి కోలాటం, భజనలు, జానపద కళాకారుల ప్రదర్శనలతో డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించి కృష్ణా నదిలో, సమీప పంట కాల్వల్లో నిమజ్జనం చేశారు.

★ తోట్లవల్లూరు మండలం భద్రిరాజుపాలెంలో ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని నాని, ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి, యలమంచిలి సుధాకర్ సంయుక్తాధ్వర్యంలో శనివారం 2 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

★ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

★ చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరం గంగానమ్మ ఆలయ ఆవరణలోని ఉత్సవ పందిరిలో ఆదివారం అన్నసమారాధనను సీఐ కె.ఈశ్వరరావు ప్రారంభించారు.

- న్యూస్‌టుడే బృందం


చల్లపల్లి: కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు


మోపిదేవిలో గ్రామోత్సవం

42 క్వింటాళ్ల చౌక బియ్యం పట్టివేత

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: యాకమూరు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన వలస గంగరాజు తోట్లవల్లూరు పరిసర ప్రాంతాల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి టాటా వ్యాన్‌లో ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్‌కు చెందిన 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని యాకమూరు నుంచి నూజివీడుకు చెందిన సోల రాముకు తరలిస్తుండగా పోలీసులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార, పీడీఎస్, రెవెన్యూ వారి సమక్షంలో దాడులు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆదివారం తెలిపారు.

ధ్యానం మనిషికి చాలా అవసరం

దేవరపల్లి(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: ధ్యానం మనిషికి చాలా అవసరమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని దేవరపల్లిలో విశ్వసృష్టి బ్రహ్మర్షి పితామహ ప్రతీజీ పిరమిడ్ నూతన ధ్యాన కేంద్రాన్ని ఆదివారం కుమార్‌రాజా ప్రారంభించారు. శివలీలా, స్వర్ణలత, రాజకుమారి, శివ నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పిరమిడ్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

లోక కల్యాణార్థం మహా చండీహోమం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం గుడివాడ మండలం చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ దేవస్థానంలో ఆదివారం మహా చండీహోమం నిర్వహించారు. 9 హోమ గుండాలతో 50 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద గల లడ్డూ ప్రసాదాన్ని బాల బ్రహ్మానందరావు, సునీత దంపతులు రూ. 1.11 లక్షలకు, మరో లడ్డూను డాక్టర్ మన్నెం భవాని శంకర్, డాక్టర్ పద్మావతి దంపతులు 20,116కు వేలంలో సొంతం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో 400 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ బొప్పూడి సుబ్రమణ్యేశ్వరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మంటాడలో ...

మంటాడ(పమిడిముక్కల): మంటాడలోని అలివేలుమంగా పద్మావతీ సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం సుదర్శన హోమం, సాయంత్రం విజయ దశమి సందర్భంగా శమీ పూజలు నిర్వహించారు.


హోమ క్రతువులో భక్తులు

భక్తిశ్రద్ధలతో బాబా సమాధి ఉత్సవం

అవనిగడ్డ, కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: విజయదశమి రోజున పుణ్యతిథిని స్థానిక శిర్డీ సాయి మందిరంలో భక్తులు పంచామృతాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తబృందం సాయి చాలీసా, లలితా, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రేపల్లె వెంకటనారాయణ పర్యవేక్షించారు.

పామర్రు, న్యూస్‌టుడే: గుడివాడ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తమ్మారెడ్డి వినోదరెడ్డి దంపతుల నేతృత్వంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోపిదేవి, న్యూస్‌టుడే: సాయి బాబా సమాధి ఉత్సవాన్ని ఆలయాల్లో నిర్వహించారు. భక్తులు సమాధిని కొలిచి పూజలు చేశారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మౌలిక వసతులు కల్పించిన ఘనత తెదేపాదే



పీఆర్ కమిషనర్ కృష్ణతేజతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గొల్లగూడెంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించిన ఘనత తెదేపా ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో కలిసి గ్రామంలో ఆయన పర్యటించారు. నియోజకవర్గంలో ఇప్పటికే అనేక గ్రామాల్లో 80 శాతం పైగా అభివృద్ధి చేసినట్లు ప్రస్తుతం మిగిలిన పనులు కూడా చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఉత్సాహంగా షటిల్ పోటీలు



క్రీడాకారులతో తెదేపా నాయకులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడులోని మేడేపూడి సుబ్బారావు ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు కేటగిరిల వారీగా పోటీ పడ్డారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలమలశెట్టి రమేష్, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు వీరమాచనేని సత్యప్రసాద్ శనివారం ఈ పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు వీరమాచనేని నాగయ్య, మత్తి సాంబశివరావు, జొరిగే శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉంగుటూరు మండలం ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2015-16లో పది చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి ఉపాధ్యాయులతో మధుర జ్ఞాపకాలను నెమర వేసుకున్న విద్యార్థులు ఆడిపాడి సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత అందిస్తామని తెలిపారు. హెచ్ఎం తిమ్మరాజు సీతారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

రోటరీ క్లబ్ వితరణతో విద్యుత్తు దహన వాటిక



వెంకటేశ్వరరావు సమక్షంలో యంత్రాలు అందుకుంటున్న ప్రభాకరరావు తదితరులు

పోరంకి: జిల్లా రోటరీ క్లబ్ వితరణతో పోరంకి, కానూరు, పెనమలూరు హిందూ శ్మశాన వాటికలకు హ్యూమన్ ఎలక్ట్రిక్ క్రిమటోరియంలను(విద్యుత్తు దహన వాటికలను) అందజేశారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఒక్కొక్కటి రూ. 10,000లు విలువజేసే మూడింటిని అందుకున్నట్లు ఆనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రభాకరరావు తదితరులు తెలిపారు.

కొయ్యగూరపాడులో వృద్ధాశ్రమం ప్రారంభం



రిబ్బను కత్తిరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలవర్ధనరావు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడులో వయోవృద్ధుల విశ్రాంతి నిలయాన్ని మాజీ ఎమ్మెల్యే, విజయా డెయిరీ డైరెక్టర్ దాసరి బాలవర్ధనరావు శనివారం ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచి పాతూరు కుటుంబ సాంబశివరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.4 లక్షల వ్యయంతో ఆశ్రమాన్ని నిర్మించారు. సర్పంచి కొరివి మాధవి, పలువురు తెదేపా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

'పల్లె పండగ'కు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



సభా ప్రాంగణం వద్ద ఇలా... - కంకిపాడు

గన్నవరం.. ప్రగతికి శ్రీకారం..!

రూ.20 కోట్లతో కార్యాచరణ

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

అమరావతి రాజధాని పరిధిలో అత్యంత ప్రాధాన్యం ఉన్న నియోజకవర్గాల్లో గన్నవరం ముందు వరసలో ఉంటోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ పార్కు, పారిశ్రామిక వాడ, ఎన్డీఆర్ఎఫ్ వంటి కీలక వ్యవస్థలన్నీ ఇక్కడే కేంద్రీకృతమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ అభివృద్ధి కూడా వేగవంతమవుతుందనుకున్నా, గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. ఈ క్రమంలో వీటి రూపురేఖలు మార్చేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దాదాపు రూ. 20 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

పల్లె పండగ పేరుతో...

గత అయిదేళ్లలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల్ని వైకాపా ప్రభుత్వం దారి మళ్లించిందని పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు విస్తృత ప్రయోజనం కలిగించే రహదారులు, డ్రైనేజీల కోసం కాకుండా, కేవలం భవనాల నిర్మాణం కోసం వీటిని ఖర్చు చేశారు. దీంతో 2014-19 మధ్య కాలంలో వేసిన సిమెంటు రోడ్లు మినహా ఎక్కడా అంతర్గత రహదారులు వేసిన దాఖలాల్లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, సామాజిక భవనాలకు రక్షణ గోడలు, పశువుల షెడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కార్యాచరణ రూపొందించింది. 'పల్లె పండగ' పేరుతో సోమవారం నుంచి వీటిని ఆచరణలోకి తేనుంది.



సిమెంట్ రహదారిగా మారనున్న కచ్చా రోడ్డు

	ఇదీ లెక్క...			
మండలం	సీసీ రోడ్లు	పొడవు (మీటర్లలో)	ప్రహరీలు	పొడవు (మీటర్లలో)
గన్నవరం	15	6,500	5	630
బాపులపాడు	35	8,280	10	550
ఉంగుటూరు	10	5,200	4	765

సర్వత్రా హర్షం

సీసీ రోడ్లు, ప్రహరీలతో పాటు 11 చోట్ల పక్కా డ్రెయిన్లు, 42 పశువుల షెడ్లు నియోజకవర్గానికి మంజూరయ్యాయి. వీటి కోసం రూ. 19.56 కోట్లు వ్యయమవుతుందని అంచనాలు రూపొందించారు. ఇప్పటికే ఏయే గ్రామాల్లో ఎక్కడెక్కడ రహదారులు వేయాలి, వేటికి ప్రహరీలు నిర్మించాలి, డ్రెయిన్లు ఎక్కడ కట్టాలి అనే జాబితాలు మండలాల వారీగా ఖరారు చేశారు. మొత్తంగా చూస్తే అయిదేళ్ల విరామం తర్వాత నియోజకవర్గంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులు మొదలవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



ప్రహరీ నిర్మించనున్న ఓగిరాల పాఠశాల

ప్రతిపాదనలు ఆమోదం..

నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాలైన గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరులలో మొత్తం 75 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వీటిల్లో 60 అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ఆమోదింపజేశారు. ఇప్పటికే అంచనాలు రూపొందించిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రోడ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. దీంతో సుమారు 20 వేల మీటర్ల మేర మూడు మండలాల్లోనూ సీసీ రోడ్లు సాకారం కాబోతున్నాయి. విజయవాడ గ్రామీణ మండలంలో సోమవారం పలుచోట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పోరంకి, న్యూస్‌టుడే : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించాలని పెనమలూరు శాసన సభ్యుడు బోడే ప్రసాద్ అన్నారు. పోరంకిలో నూతనంగా ఏర్పాటు చేసిన హార్ట్ హెల్త్ కేర్ ఆసుపత్రిని ఆయన ఆదివారం ప్రారంభించారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను పరిశీలించారు. హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ షేక్ మస్తాన్, డాక్టర్ అన్నే షఫాలి, అన్నే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితో బాబా సమాధి ఉత్సవం



పువ్వులతో అలంకరించిన బాబా సమాధి



పోరంకి: శ్రీనివాస నగర్‌లో..

పోరంకి, న్యూస్‌టుడే : పోరంకి శ్రీనివాస నగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో బాబా వారి 106వ సమాధి ఉత్సవం 106 జ్యోతులతో వైభవంగా జరిగింది. కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మున్నంగి అర్జున్ రెడ్డి, ప్రధానార్చకుడు ఏలూరు అనిల్ శర్మ, షిర్డీ సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం): గండిగుంట అయ్యప్ప స్వామి దేవాలయంలోని సాయిబాబా ఉపాలయంలో బాబా 106వ సమాధి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధిని పలు రకాల పూలతో అలంకరించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల గంగాధరరావు, ఉషా రామకృష్ణ దంపతులు పర్యవేక్షించారు.

జూదరుల అరెస్టు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై గన్నవరం పోలీసులు ఆదివారం దాడి చేశారు. స్టేషన్ పరిధిలోని మాదలవారిగూడెంలో నిర్వహించిన దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, సుమారు రూ. మూడు వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు.

ఉంగుటూరులో రేషన్ పంచాయితీ

అధికారుల నిర్లక్ష్యంతో పండగ రోజు పస్తులు

ఉంగుటూరు (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే



రేషన్ దుకాణానికి వేసిన సీల్



సరకు వివరాలు అడిగి తెలుసుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

సకాలంలో రేషన్ బియ్యం అందడం లేదని ఉంగుటూరు మండల కేంద్రానికి చెందిన ఎనిమిదో నంబరు చౌక ధరల దుకాణం పరిధిలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో దసరా పండగ రోజు కూడా పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. స్థానిక దుకాణ డీలరుగా వ్యవహరిస్తున్న ఎస్.శ్రీనివాసరావు జులైలో మృతి చెందారు. అనంతరం అతని భార్య రేషన్ సరకులను లబ్ధిదారులకు అందిస్తున్నారు. శ్రీనివాసరావు మృతితో ఖాళీగా దర్శనమిస్తున్న డీలరు పోస్టును డ్వాక్రా గ్రూప్ ద్వారా జి.అనూషకు అధికారులు సెప్టెంబరులో కేటాయించారు. రేషన్ దుకాణాన్ని అధికారులు కేటాయించినప్పటికీ పీడీఎస్ డీటీ మాత్రం తాజాగా సరకులను శ్రీనివాసరావు భార్యకు అప్పగించి అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే సామగ్రిని మాత్రం కొత్త డీలరుకు అందజేశారు. అదేంటని పలువురు అధికారులను నిలదీయడంతో వివాదం తలెత్తింది. పాత, కొత్త డీలర్ల మధ్య వివాదం కారణంగా తమకు దసరా రోజుకు కూడా రేషన్ అందలేదని లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఈ వివాదం నేపథ్యంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేపట్టి స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు బియ్యం సహా ఇతర లెక్కల విషయంలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించి సీల్ వేశారు.

★ దీనిపై తహసీల్దార్ విమలకుమారి మాట్లాడుతూ.. మరణించిన డీలరు శ్రీనివాసరావు భార్య అమరేశ్వరి దుకాణాన్ని తనకు కేటాయించాలని కోర్టును ఆశ్రయించడంతో వివాదం తలెత్తిందని.. ప్రస్తుతం వీఆర్వో ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అందివ్వడం జరుగుతుందని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 14 తర్వాత ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



యనమలకుదురు: కనకదుర్గమ్మ ఆలయంలో..



యనమలకుదురులో పార్వతీదేవి అలంకారం



రామవరప్పాడులో..



కొత్తపల్లిలో...



హనుమాన్ జంక్షన్‌లో..



పెనమలూరులో..



కంకిపాడులో..



పాత గన్నవరంలో...



ఉప్పులూరులో..



అన్నదానంలో బారులుదీరిన భక్తులు

దుర్గా భవానీ..కరుణించమ్మా

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దీనిలో భాగంగా ఆయా దేవాలయాల్లో కలశ ప్రదక్షిణ, జమ్మి ఉత్సవం, ఉత్సవమూర్తుల ఊరేగింపు, భవానీ దీక్షదారుల దీపార్చన, అన్న ప్రసాద సంతర్పణలో పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, బృందం



దత్తపీఠంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రంగన్నగూడెంలో..



మద్దూరులో..



జమ్మి పూజ చేస్తూ..

విజయ డెయిరీ పునఃప్రారంభం

చిట్టినగర్, న్యూస్‌టుడే బుడమేరు ముంపుతో దాదాపు 40 రోజుల పాటు మూతపడిన విజయ డెయిరీని దసరా పండగ రోజున పునఃప్రారంభించామని కృష్ణా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయ డెయిరీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురై ఫ్యాక్టరీ పనిచేయక పోయినప్పటికీ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరవల్లిలోని కామధేనువు పేరుతో నిర్మించిన కొత్త ఫ్యాక్టరీ ఆదుకుందన్నారు. అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించామన్నారు. డెయిరీకి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీడీబీ వారికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా సిఫార్సు చేశారని తెలిపారు. విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఆంజనేయులు చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. రైతులకు బోనస్ రూ. 250 కోట్లకు పైగా చెల్లించారని వివరించారు. పాలసేకరణ పెరిగిందన్నారు. సమావేశంలో పలువురు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వామ్యం

ఉయ్యూరు గ్రామీణం: ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆదివారం గండిగుంటలోని నివాసంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి రోజూ వీధులను పరిశుభ్రం చేస్తూ పట్టణాన్ని స్వచ్ఛతగా మార్చడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలోనూ భాగస్వాములవుతున్నారని తెలిపారు. కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, పారిశుద్ధ్య అధికారి సంతోష్, రాజేష్, రఘు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరుకు చెందిన షేక్ బషీర్(24) ఓ ఫర్నిచర్ దుకాణంలో టెక్నీషియన్‌గా పని చేస్తుంటారు. ఇతను అదే గ్రామానికి చెందిన కావ్య అనే యువతిని గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత కావ్యకు అనారోగ్యం ఉందని, తిరిగి పంపుతామని ఆమె బంధువులు భర్తకు చెప్పి ఆమెను తీసుకెళ్లారు. అప్పటి నుంచి కావ్య కాపురానికి రావడం లేదని బషీర్ ఆవేదన చెందుతుండేవారు. ఈ క్రమంలో భార్యభర్తలిద్దరూ తరచూ చరవాణిలో మాట్లాడుకొంటుండగా ఇటీవల వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. బషీర్ ఓ రోజు కావ్య వద్దకు వెళ్లి గొడవ పడటంతో ఈమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదైంది. అప్పటి నుంచి బషీర్ తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ నెల 7న రాత్రి ఇతను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతను శనివారం మృతి చెందారు. తండ్రి షేక్ బాబ్జి పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని...

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : కానుమోలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కన్పించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనుమాన్ జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపారు. సుమారు 60 ఏళ్లు ఉన్న వ్యక్తి స్థానిక సామాజిక భవనం వద్ద అచేతనంగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు, శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షేత్ర విచారణ అనంతరం మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, నీలం రంగు గళ్ల లుంగీ, బిస్కెట్ రంగు టీ-షర్టు ధరించి ఉన్నాడని ఎస్సై వివరించారు.

యువతి అదృశ్యంపై కేసు

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే : యనమలకుదురుకు చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. ఈమె డిగ్రీ వరకూ చదువుకొని పటమటలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 9న కార్యాలయానికి వెళ్తున్నట్లు ఇంట్లో తెలిపి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈమె ఫోన్ పని చేయకపోవడం, ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వివాహిత..

పెనమలూరు, న్యూస్‌టుడే : వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. కానూరుకు చెందిన ఈమె కొద్ది రోజులుగా తాను కూడా పనిలోకి వెళ్తానంటూ భర్తను అడుగుతుండగా భర్త ఈమెతో విభేదించసాగాడు. ఈ నేపథ్యంలో ఈమె ఈ నెల 5న తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈమె ఆచూకీ తెలియక పోవడంతో భర్త పెనమలూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

పెనమలూరు: ఆటో ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కంకిపాడుకు చెందిన మరీదు రవిబాబు పెనమలూరులో జ్యూస్ దుకాణం నిర్వహిస్తుంటారు. ఈ నెల 6న రాత్రి ఇతను ఉపేంద్ర అనే వ్యక్తితో ద్విచక్ర వాహనంపై కంకిపాడు బయలుదేరారు. గంగూరు స్పిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ ఆటో వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వీరిద్దరికీ బలమైన గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ రవిబాబు పెనమలూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తుండగా ప్రమాదం

గాయాలతో చికిత్స పొందుతున్న ఇద్దరు యువకులు

గోకవరం, న్యూస్‌టుడే: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అనూహ్యంగా రోడ్డు ప్రమాదానికి గురై పోలీసులకు దొరికిపోయారు. తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన బి.ప్రతాప్, కంకిపాడు మండలం మదాతువారిపాలెం చెందిన జ్యోతిప్రకాష్ ఆదివారం రంపచోడవరం నుంచి రాజమహేంద్రవరం వైపు మోటారుసైకిల్‌పై వెళుతూ గోకవరం శివారు సాయిప్రియాంక లేఅవుట్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ప్రమాదంలో జ్యోతిప్రకాష్ కాలు విరిగిపోగా ప్రతాప్‌కు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహన సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలంలో పడి ఉన్న వాహనం, బ్యాగులో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దారకొండలో గంజాయిని కొనుగోలు చేసి విజయవాడ తరలిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.